

చోరీ కేసులో సినీనటి సౌమ్యశెట్టి అరెస్టు


- స్నేహితురాలి ఇంట్లోకి వెళ్లి బంగారం చోరీ
- 57 తులాలు రికవరీ చేసిన విశాఖ పోలీసులు

- వార్త మెయిన్‌లో..



పైనరీ అందాలు కనువిందు

పర్యాటకులను ఆకట్టుకుంటున్న అంజోడ సిల్క్‌ఫాం



అంజోడ సిల్క్‌ఫాంలోని పైనరీ ముఖ ద్వారం



రేంజ్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన టెంట్లు

డుంబ్రిగుడ, మార్చి 3: అరకులోయలో గల అంజోడ సిల్క్ ఫాంలోని పైనరీ అందాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. పచ్చని పైన్ చెట్లు, పూల వనాలు, విశ్రాంతి టెంట్లు సందర్శకులకు ఆహ్వానం పలుకుతున్నాయి. పర్యాటకుల విడిది గృహాలతో పాటు రెస్టారెంట్ ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. ఎకో టూరిజంగా అభివృద్ధి చేసి పర్యాటకులకు మరింత ఆహ్లాదం కలిగేలా పైనరీని అటవీశాఖ ఆధునికీకరించింది. పైనరీ అభివృద్ధికి రూ.71 లక్షలు వెచ్చించారు. పైన్ చెట్ల నడుమ ముఖ ద్వారాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. సహజ సిద్ధ చెట్ల చెక్కలతో బెంచీలను ఏర్పాటు చేశారు. పర్యాటకులు ఆహ్లాదంగా గడిపేందుకు చుట్టూ కంచెను ఏర్పాటు చేసి పూల వనాలను అభివృద్ధి చేశారు. చుట్టూ విద్యుత్ కాంతులు విరజిమ్మేలా ఆధునికీకరించారు. సహజ సిద్ధ పైన్ చెట్ల నడుమ పర్యాటకులు ఫొటోలు దిగేందుకు, హాయిగా గడిపేందుకు పైనరీ వేదికగా నిలుస్తుంది. పైన్ చెట్ల నీడలో చల్లని గాలుల మధ్య టెంట్లు ఏర్పాటు చేశారు. దీంతో పాటు అరకులోయ రేంజ్ కార్యాలయం చుట్టూ చెట్లకు విద్యుత్తు దీపాలను ఏర్పాటు చేశారు. పైనరీ అందాలు పర్యాటకులను ఆకట్టుకోవడంతో అధిక సంఖ్యలో ఇక్కడికి వస్తున్నారు.





అంజోడ సిల్క్‌ఫాంలో పైన్ చెట్లు (ఇన్‌సెట్‌లో) రెస్టారెంట్



మహా పాదయాత్రలో పాల్గొన్న కార్మిక, ప్రజా సంఘాల నాయకులు, ఉక్కు ఉద్యోగులు

కదంతొక్కిన ఉక్కు కార్మికులు

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మహా పాదయాత్ర

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఉక్కు కార్మికులు ఆదివారం విశాఖలో కదం తొక్కారు. కూర్మన్నపాలెంలోని దీక్షా శిబిరం నుంచి ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ, వామపక్ష నాయకుల ఆధ్వర్యంలో మహా పాదయాత్రను నిర్వహించారు.

- వార్త 7వ పేజీలో..

ప్రాథమిక పాఠశాలల్లో అంగన్‌వాడీల విలీనం?

వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమల్లోకి

- ఉమ్మడి జిల్లాలో 342 కేంద్రాల గుర్తింపు
- నేటి నుంచి ఎన్‌సీఈఆర్‌టీ బృందం పర్యటన
- వసతులు, ఇతర అంశాలపై పరిశీలన

విశాఖపట్నం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కేంద్రం రూపొందించిన నూతన విద్యా విధానం అమల్లో భాగంగా ప్రాథమిక పాఠశాలల్లో అంగన్‌వాడీ కేంద్రాల విలీనం కోసం విస్తృతస్థాయి కసరత్తు జరుగుతోంది. ఒకే ప్రాంగణంలో ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలున్న వాటిని ముందుగా గుర్తించి విలీనం చేయనున్నారు. ఈ ప్రక్రియ ముగిసిన అనంతరం సమీపంలోని కేంద్రాలను కూడా విలీనం చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు.

ఉమ్మడి విశాఖ జిల్లాలో 342 చోట్ల ఒకే ప్రాంగణంలో ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ముందుగా వీటన్నింటినీ విలీనం చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఇది ముగిసిన తరువాత దగ్గరగా ఉన్న వాటిని విలీనం చేసేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. నూతన విద్యావిధానంలో భాగంగా రెండేళ్ల క్రితమే ఉన్నత పాఠశాలకు కిలోమీటరు దూరంలో ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో మూడు, నాలుగు, ఐదు తరగతులను విలీనం చేశారు. దీంతో ఆయా ఉన్నత పాఠశాలల్లో మూడు నుంచి పది వరకు తరగతుల బోధన జరుగుతోంది. ఈ ప్రక్రియలో భాగంగా రేషనలైజేషన్ చేసి ప్రాథమిక పాఠశాలల్లో మిగులు టీచర్లను ఉన్నత పాఠశాలకు పంపారు. ప్రస్తుతం మూడు నుంచి ఐదు తరగతులకు సబ్జెక్టు టీచర్లు బోధిస్తున్నారు. ఉన్నత పాఠశాలలకు కిలోమీటరు దూరంలో ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో మూడు నుంచి ఐదు తరగతుల విలీనం నేపథ్యంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల్లో చేరారు. ఈ విలీనంపై సర్వత్రా వ్యతిరేకత వెల్లువెత్తినా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం మొండిగా వ్యవహరించిందన్న ఆరోపణలున్నాయి.



విశాఖలో ఒకే ప్రాంగణంలో ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నది ఇక్కడే..

పునాది పాఠశాలలుగా మార్పు

ఇదిలావుండగా రానున్న విద్యా సంవత్సరం నుంచి ఒకే ప్రాంగణంలో ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో అంగన్‌వాడీ కేంద్రాలను విలీనం చేయనున్నారు. వీటిని పునాది పాఠశాలలు (ఫౌండేషన్ స్కూళ్లు) అని పిలుస్తారు. మూడేళ్ల నుంచి ఎనిమిదేళ్ల వయసు మధ్య ఉండే బాల బాలికలు ఈ పాఠశాలల్లో చదువుతారు. ప్రీకేజీ నుంచి రెండో తరగతి వరకు విద్యార్థులకు అందించే బోధనను పూర్వ ప్రాథమిక విద్యగా వ్యవహరిస్తారు. అంగన్‌వాడీ కేంద్రాల విలీనం నేపథ్యంలో ఆయా పాఠశాలల్లో వసతులు ఉన్నాయా? భద్రతా ప్రమాణాలు, పారిశుద్ధ్యం, తాగునీరు తదితర అంశాలపై కేంద్ర ప్రభుత్వం వివరాలు కోరుతోంది. ఈ మేరకు నేషనల్ కరికులమ్ ఫ్రేమ్‌వర్క్ స్టేజ్ 1లో భాగంగా పునాది స్కూళ్లు ప్రారంభించే ... మిగతా 6వ పేజీలో

సీఎం జగన్ రాక రేపు



విశాఖపట్నం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల ఐదోతేదీన విశాఖలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం 9.40 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి విమానంలో బయలుదేరి 10.30 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి 10.35 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 10.45కు రుషికొండలోని ఐటీ హిల్ నంబరు -3లో ఉన్న హెలీప్యాడ్‌కు చేరుకుని, అక్కడి నుంచి రోడ్డు మార్గంలో రాడిసన్ బ్లూ హోటల్‌కు ఉదయం 11 గంటలకు చేరుకుంటారు. మధ్యాహ్నం 12.30 గంటల వరకు విజన్ వైజాగ్ లోగో ఆవిష్కరణ, పారిశ్రామికవేత్తల సమావేశంలో పాల్గొంటారు. అనంతరం రోడ్డు మార్గంలో పీఎంపాలెంలోని వి కన్వెన్షన్ హాల్‌కు 12.45 గంటలకు చేరుకుని, 'కేస్కేడింగ్ స్కిల్స్-పేరిడియం భగవత' సదస్సును ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 1.50 గంటలకు తిరిగి రుషికొండ హిల్ నంబరు-3కి చేరుకుని హెలికాప్టర్‌లో ఎయిర్‌పోర్టుకు చేరుతారు. 2.30 గంటలకు విమానంలో గన్నవరం బయలుదేరి వెళతారు.

ఏజెన్సీలో ఉద్యోగాలన్నీ గిరిజనులకే ఇవ్వాలి

గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర డిమాండ్

- 9న స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వకుంటే 10న మన్యం బంద్



పాడేరులో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న కిల్లో సురేంద్ర

పాడేరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలోని ఉద్యోగాలన్నీ గిరిజనులకే దక్కాలని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీవో:3 రద్దు, అరకొరగా టీచర్ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతున్న తరుణంలో ఆదివారం పాడేరులో డీఎస్సీ సాధన సమితి, గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం మెగా డీఎస్సీ ప్రకటించకపోవడంతో పాటు ప్రస్తుతం ప్రకటించిన డీఎస్సీలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో 329 పోస్టులు మాత్రమే భర్తీ కావడం, అందులో గిరిజనులకు కేవలం 18 పోస్టులు మాత్రమే ఉండడం దారుణమన్నారు. అలాగే జీవో: 3 రద్దు నేపథ్యంలో గిరిజన ప్రాంతంలోని ఉద్యోగాలను కేవలం గిరిజనులతోనే భర్తీ చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. గిరిజన ప్రాంతంలో ఇతరులకు ఉద్యోగాలు ఇవ్వడం వల్ల స్థానిక గిరిజనులు తీవ్రంగా నష్టపోతున్నారని సురేంద్ర ఆవేదన వ్యక్తం చేశారు.

9న నోటిఫికేషన్ ఇవ్వకుంటే బంద్

రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల తొమ్మిదో తేదీలోగా గిరిజన స్పెషల్ డీఎస్సీకి నోటిఫికేషన్ జారీ చేయకుంటే పదో తేదీన మన్యం బంద్ నిర్వహిస్తామని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర హెచ్చరించారు. ప్రత్యేక డీఎస్సీ సాధనలో భాగంగా సోమవారం కలెక్టరేట్ ముట్టడి జరుగుతుందని, అలాగే తొమ్మిదో తేదీ నాటికి ప్రత్యేక గిరిజన డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. డీఎస్సీ సాధన సమితి కన్వీనర్ నరేశ్, గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బీల్ దేవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ ముట్టడి

- గిరిజన స్పెషల్ డీఎస్సీ కోసం పోరాటం

పాడేరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక గిరిజన డీఎస్సీని ప్రకటించాలనే డిమాండ్‌పై డీఎస్సీ సాధన సమితి, గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని తలపెట్టనున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా గిరిజనులకు కేవలం 517 టీచర్ పోస్టులు మాత్రమే ఉన్నాయి. అలాగే ఉపాధ్యాయ పోస్టుల్లో గిరిజనులకు శత శాతం రిజర్వేషన్ కల్పించే జీవో:3 రద్దుతో గిరిజనులకు మరింత అన్యాయం జరిగింది. దీంతో గిరిజన ప్రాంతాల్లో టీచర్ పోస్టులను గిరిజన అభ్యర్థులతోనే భర్తీ చేసేలా గిరిజన స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయాలనే డిమాండ్‌పై కలెక్టరేట్ ముట్టడికి డీఎస్సీ సాధన సమితి, గిరిజన సంఘం పిలుపు ఇచ్చింది.



చింతలవీధి సబ్‌సెంటర్‌లో చిన్నారికి పోలియో చుక్కల మందు వేస్తున్న కలెక్టర్ విజయసునీత, పక్కన డీఎంహెచ్‌వో జమాల్ బాషా

పల్స్ పోలియోకు విశేష స్పందన

పాడేరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సి.జమాల్ బాషా తెలిపారు. జిల్లా వ్యాప్తంగా లక్షా 23 వేల 673 మంది చిన్నారులకు పోలియో చుక్కల మందు వేయాలనే లక్ష్యంతో చర్యలు చేపట్టామని, తొలి రోజు ఆదివారం లక్షా 20 వేల 722 మంది చిన్నారులకు వేశామని అది 97.6 శాతంగా నమోదైందన్నారు. మిలిగిన 2,951 మంది చిన్నారులను గుర్తించి సోమ, మంగళ వారాలు వారికి చుక్కల మందు వేస్తామన్నారు. జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమానికి 2,232 కేంద్రాలు, 63 మొబైల్ బూత్‌లు, 54 ట్రాన్సిట్ బూత్‌లను ఏర్పాటు చేశామని, 8,928 మంది సిబ్బంది, 264 మంది సూపర్‌వైజర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు.

పెరిగిన చలి

మళ్లీ తగ్గిన కనిష్ఠ ఉష్ణోగ్రతలు



లంబసింగిలో మంచు

పాడేరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. చలి తీవ్రత పెరిగింది. జి.మాడుగుల, అరకులోయలో 12.1, పాడేరులో 13, జీకేవీధిలో 13.4, హుకుంపేట, పెదబయలులో 13.8, ముంచంగిపుట్టులో 14.3, అనంతగిరిలో 14.7 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రతలు ఆదివారం నమోదయ్యాయి. జిల్లా కేంద్రం మినహా పలు ప్రాంతాల్లో తెల్లవారుజాము నుంచి ఉదయం ఎనిమిది గంటల వరకు ఒక మోస్తరుగా పొగ మంచు కురిసినప్పటికీ మధ్యాహ్నం మాత్రం ఎండ ప్రభావం తగ్గలేదు.

చింతపల్లిలో..

చింతపల్లి: మన్యంలో మళ్లీ కనిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గాయి. దీంతో రాత్రి వేళ చలి తీవ్రత పెరిగింది. ఆదివారం చింతపల్లిలో 12.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్టు స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఎం.సురేశ్ కుమార్ తెలిపారు. ప్రస్తుతం సాయంత్రం ఐదు గంటల నుంచి మరుసటి రోజు ఉదయం తొమ్మిది గంటల వరకు చలి ఉంటుంది. అలాగే ఉదయం ఎనిమిది గంటల వరకు మంచు కురుస్తున్నది.



రక్తపు మడుగులో పడి ఉన్న బలరాం మృతదేహం

గిరిజన యువకుడి హత్య

- నిందితుడు సాధువు



పోలీసుల అదుపులో ఉన్న నిందితుడు మోహన్ (సాధువు)

ముంచంగిపుట్టు, మార్చి 3: మండల కేంద్రంలో ఓ గిరిజన యువకుడిని సాధువు కిరాతంగా హత్య చేశాడు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీనికి సంబంధించి ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. మండల కేంద్రంలో గల అంబేడ్కర్ పార్కు సమీపంలో ఆదివారం సాయంత్రం ఒక ఇంటి ముందు రక్తపుమడుగులో పడిఉన్న యువకుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్‌ఐ కె.రవీంద్ర సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని అంబులెన్స్‌లో సీహెచ్‌సీ మార్చురీకి తరలించారు. మృతదేహంపై రెండు కత్తిపోట్లు ఉన్నట్టు గుర్తించారు. హత్యకు గురైన వ్యక్తి మండలంలోని జర్జుల పంచాయతీ సంతవీధికి చెందిన గిరిజన యువకుడు వి.బలరాం(27)గా గుర్తించారు. ఆ యువకుడిని హత్య చేసిన వ్యక్తి కర్ణాటక రాష్ట్రం అంబల్వాడి గ్రామానికి చెందిన పి.మోహన్(సాధువు)గా పోలీసులు గుర్తించారు. పాలపిండి విక్రయించేందుకు ఇంటి నుంచి మండల కేంద్రం వచ్చిన బలరాం అంబేడ్కర్ పార్కు సమీపంలో గల ఒక ఇంటి వద్దకు వెళ్లాడు. అయితే అప్పటికే మద్యం మత్తులో ఉన్న సాధువు ఇక్కడికి నువ్వెందుకు వచ్చావని బలరాంను ప్రశ్నించినట్టు తెలిసింది. దీంతో వీరిద్దరి మధ్య మాటా మాటా పెరగడంతో సాధువు తన వద్ద ఉన్న కత్తితో బలరాంపై దాడి చేసినట్టు తెలిసింది. సాధువుని అదుపులోకి తీసుకొని పోలీసులు విచారిస్తున్నారు. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. బలరాం హత్యకు గురయ్యాడని తెలియడంతో కుటుంబ సభ్యులు, బంధువులు సంఘటన స్థలానికి చేరుకొని బోరున విలపించారు.

యువ జంట అనుమానాస్పద మృతి

అరకులోయ, మార్చి 3: అనంతగిరి మండలం కరకవలస గ్రామ సమీపంలో కటికి జలపాతానికి వెళ్లే దారిలో చెట్టుకు ఉరివేసుకుని యువ జంట ఉండడాన్ని స్థానిక పశువుల కాపరులు ఆదివారం గుర్తించారు. ఈ విషయాన్ని గ్రామ పెద్దలకు తెలియజేయడంతో వారు వీఆర్వోకు సమాచారం ఇచ్చారు. అనంతగిరి పోలీసులకు వీఆర్వో సమాచారం ఇచ్చారు. ఆ యువ జంట ఎక్కడి వారు?, ఎందుకు ఆత్మహత్య చేసుకున్నారు? అనే విషయాలు తెలియాల్సి ఉంది.



పాతపాడేరు అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారికి పోలియో మందు వేస్తున్న పీవో

చిన్నారుల ఉజ్వల భవితకు పోలియో చుక్కలు దోహదం

» జిల్లా కలెక్టర్ ఎం.విజయసునీత

పాడేరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు పోలియో చుక్కలు ఎంతగానో దోహద పడతాయని జిల్లా కలెక్టర్ ఎం.విజయసునీత అన్నారు. మండలంలోని చింతలవీధి సబ్ సెంటర్‌లో కలెక్టర్ పలువురు చిన్నారులకు పోలియో చుక్కల మందు వేసి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఒక లక్షా 23 వేల మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలే లక్ష్యంతో అవసరమైన చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలో ఐదేళ్లలోపు చిన్నారులందరికీ విధిగా పోలియో చుక్కల మందు వేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె సూచించారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలన్నారు. ముఖ్యంగా భవన నిర్మాణ కార్మికులు, ఇటుకల బట్టీల్లో పని చేస్తున్న కార్మికుల పిల్లలకు విధిగా పోలియో చుక్కల మందు వేయాలన్నారు. కాగా స్థానిక పాత పాడేరు అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ పోలియో చుక్కల మందు వేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ సి.జమాల్ బాషా, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ సాధన, వైద్య, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజానికి సహకరించండి: ఎంపీ



తన బిడ్డకు పోలియో చుక్కలు వేయిస్తున్న అరకు ఎంపీ మాధవి

కొయ్యూరు, మార్చి 3: పోలియో రహిత సమాజానికి అందరూ సహకరించాలని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి కోరారు. శరభన్నపాలెం గ్రామంలో పోలియో చుక్కల కార్యక్రమాన్ని ఆదివారం ఎంపీ ప్రారంభించారు. అనంతరం తన కుమార్తెకు పోలియో చుక్కలు వేయించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ నిండు జీవితానికి రెండు చుక్కలని, ఐదేళ్ల లోపు చిన్నారులకు తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వం ఆశిస్తున్నట్టు పోలియో రహిత సమాజ నిర్మాణానికి సహకరించడం అందరి బాధ్యతగా ఆమె పేర్కొన్నారు. రాజేంద్రపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి తన పరిధిలోని పలు బూత్‌లను సందర్శించి పోలియో చుక్కల కార్యక్రమం నిర్వహణ తీరుపై పర్యవేక్షించారు. లక్ష్యం మేరకు మండలంలో పోలియో చుక్కలు వేసినట్టు వైద్య సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చింతపల్లిలో 97 శాతం చుక్కల మందు పంపిణీ

చింతపల్లి, మార్చి 3: మండలంలోని పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 97 శాతం పోలియో చుక్కల మందు పంపిణీ చేసినట్టు వైద్యులు తెలిపారు. చింతపల్లి సీహెచ్‌సీ, తాజంగి, లంబసింగి, కోరుకొండ, లోతుగెడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ఉప కేంద్రాలు, బస్ స్టాండ్‌ల వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ఐదేళ్ల లోపు చిన్నారులకు చుక్కల మందు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ సోమ, మంగళవారాల్లో ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు గృహాలకు వచ్చి చుక్కల మందు వేస్తారన్నారు. ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు సంతోష్ కుమార్, లక్ష్మీకాంత్, శివ ప్రసాద్, జగదీశ్ పాల్గొన్నారు.

పెదబయలులో 98 శాతం...

పెదబయలు, మార్చి 3: మండలంలోని పోలియో చుక్కలు 98.7 శాతం వేసినట్టు వైద్యాధికారి నిఖిల్ తెలిపారు. పెదబయలు పీహెచ్‌సీలో 98.7 శాతం, గోమంగి పీహెచ్‌సీ 98.3, రూడకోట పీహెచ్‌సీలో 93 శాతంగా నమోదైనట్టు వైద్యాధికారి వివరించారు.

సీలేరు, ధారకొండలో...

సీలేరు, మార్చి 3: గూడెంకొత్తవీధి మండలంలోని సీలేరు, ధారకొండలో పల్స్ పోలియో విజయవంతంగా ముగిసింది. ధారకొండ పీహెచ్‌సీలో 98 శాతం చిన్నారులకు పల్స్‌పోలియో చుక్కలు వేసినట్టు డాక్టర్ డీకే హిమబిందు తెలిపారు. అలాగే సీలేరులో 962 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యం కాగా, 1012 మందికి వేసి లక్ష్యాన్ని అధికమించామని వైద్యాధికారి ఎస్కే మస్తాన్ వల్లీ తెలిపారు.

జి.మాడుగులలో 7, 519 మందికి చుక్కల మందు

జి.మాడుగుల, మార్చి 3: మండల వ్యాప్తంగా 7,519 మంది చిన్నారులకు పోలియో చుక్కల మందు వేసినట్టు వైద్యాధికారులు రవిచంద్రశేఖర్, శశికాంత్ తెలిపారు. జి.మాడుగుల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో 4,422 మంది, గెమ్మెలి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో 3,095 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్టు చెప్పారు.

డుంబ్రిగుడలో 7,650 మందికి..

డుంబ్రిగుడ, మార్చి 3: మండలంలో ఆదివారం నిర్వహించిన పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతమైంది. మండల కేంద్రం డుంబ్రిగుడ, కొర్రాలో జరుగుతున్న చుక్కల మందు కార్యక్రమాన్ని వైద్యాధికారి రాంబాబు పర్యవేక్షించి చిన్నారులకు చుక్కల మందును వేశారు. మొత్తం 7650 మంది చిన్నారులకు చుక్కల మందును వేశారు. డుంబ్రిగుడ, చాపరాయి జలవిహారితో పాటు అంజోడ సిల్క్‌ఫాంలో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటుచేసి పర్యాటకుల చిన్నారులకు చుక్కల మందులను వేశారు. ఈ కంద్రంలో వైస్ ఎంపీపీ ఆనందరావు, డుంబ్రిగుడలో సర్పంచ్ వెంకటరావు, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అరకు పబ్లిక్ పాఠశాలలో ఎన్‌సీసీ విద్యార్థుల ఎంపిక



ఎన్‌సీసీకి ఎంపికైన విద్యార్థులతో బెటాలియన్ ఎస్ఎం.సంజీవన్, సిబ్బంది

అరకులోయ, మార్చి 3: స్థానిక ఏఎస్ఆర్ పబ్లిక్ స్కూల్‌లో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి 25 మందిని ఎంపిక చేసినట్టు డైరెక్టర్ శ్రీధర్ తెలిపారు. ఆదివారం అరకు స్కూల్ గ్రౌండ్‌లో 2(ఏ) బెటాలియన్ విశాఖపట్నం నుంచి విచ్చేసి మరలా 25 మంది విద్యార్థుల ఎంపిక చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు సంబంధించి ఫిట్‌నెస్ టెస్ట్‌లను విశాఖపట్నం నుంచి విచ్చేసిన ఎస్ఎం కెకె.సంజీవన్, సిబ్బంది కుమార్, రవీంద్ర నిర్వహించారని శ్రీధర్ కోరారు.

కేబుల్ గోతులో పడి దుక్కిటెద్దుల మృత్యువాత



గోతిలో మృతి చెంది ఎద్దులు

కొయ్యూరు, మార్చి 3: బూదరాళ్ల పంచాయతీలోని కన్నవరం గ్రామంలో బీఎస్ఎన్ఎల్ టవరు నిర్మాణ చర్యల్లో భాగంగా కేబుల్ వేసేందుకు తీసిన గోతిలో ఆదివారం రెండు దుక్కిటెద్దులు పడిపోయి మృత్యువాత పడ్డాయి. కన్నవరం గ్రామానికి చెందిన మర్రి కోటేశ్వరావు, పాంగి మహేష్‌లకు చెందిన ఎద్దులు ఆదివారం మేతకు వెళ్లేందుకు కేబుల్ గోతిని దాటుతూ ప్రమాదవశాత్తూ పడిపోయాయి. ఎవరూ చూడక పోవటంతో రెండు ఎద్దులు మృత్యువాత పడ్డాయి. దీంతో రైతులకు సుమారు రూ.60 వేల ఆస్తి నష్టం వాటిల్లింది. రైతులకు నష్టపరిహారం అందించేలా చర్యలు చేపట్టాలని సర్పంచ్ సాగిన ముత్యాలమ్మ, వార్డు సభ్యుడు సంజీవ్ డిమాండ్ చేశారు. ఈ ఘటనల పునరావృతం వారు కోరారు.

వైసీపీ రాక్షస పాలనను అంతమొందిద్దాం..

» టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి



సుంద్రుపుట్టులో మహిళలకు కరపత్రాలు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి

పాడేరు రూరల్, మార్చి 3: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఐదేళ్లుగా పట్టి పీడిస్తున్న జగన్‌రెడ్డి రాక్షస పాలనను అంతమొందించేందుకే టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శంఖారావం కార్యక్రమాన్ని తలపెట్టారని పార్టీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి అన్నారు. మండలంలోని సుంద్రుపుట్టు గ్రామంలో బూత్ కమిటీ ప్రతినిధులు కూడా కోటిబాబు, యువ నాయకుడు సురేష్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం ద్వారా ఆరు గ్యారంటీ పథకాలు అందించనున్నట్టు చెప్పారు. తల్లికి వందనం పథకం కింద ఇంటిలో చదివే ప్రతీ బిడ్డకు ఏడాదికి రూ.15 వేలు, ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.15 వేలు, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం తదితర పథకాలను ప్రజలకు ఆమె వివరించారు. పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేసే సూపర్ సిక్స్ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించి అదరూ టీడీపీకి ఓటు వేసేలా చూడాలని క్యాడర్‌కు సూచించారు. జిల్లా కేంద్రం పాడేరులో ఉన్న సుంద్రుపుట్టులో ప్రభుత్వం కనీస సదుపాయాలు కల్పించలేని దుస్థితిలో ఉందని వాపోయారు. ఇటువంటి ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సూపర్-6 పథకాలపై విస్తృత ప్రచారం చేయండి

టీడీపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర



దిబ్బవలస గ్రామస్థులతో మాట్లాడుతున్న దొన్నుదొర

అరకులోయ, మార్చి 3: సూపర్-6 పథకాలపై విస్తృత ప్రచారం చేయాలని టీడీపీ అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర కోరారు. మండలంలో మారుమూల సిరగం పంచాయతీ పరిధిలోని పీవీటీజీ గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. లంతంపాడు, దిబ్బవలస తదితర గ్రామాల్లో బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింట తిరుగుతూ సూపర్-6 పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ప్రతి ఏటా రూ.20 వేల పెట్టుబడి, మహిళలకు ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, చదువుకునే ప్రతీ విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు వంతున ఆర్థిక సాయం, నిరుద్యోగ యువతీ, యువకులకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి అందించనున్నట్టు చెప్పారు. అలాగే రాష్ట్రంలో సైకో పాలనను సాగనంపాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంతో పాటు గిరిజన ప్రాంతం అభివృద్ధి జరగాలంటే టీడీపీ-జనసేన కూటమికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఇందుకోసం ఇంటింటా సూపర్-6 పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెదలబుడు, చినలబుడు సర్పంచులు పెట్టెలి దాసుబాబు, ఉపేంద్ర, పెదలబుడు వైస్ సర్పంచ్ చందూవిజయనిర్మల, పార్టీ నేత జగన్ పాల్గొన్నారు.

ఆశ్రమాల్లో పక్కాగా మెనూ అమలు కావాలి

» ఉపాధ్యాయులకు ఐటీడీఏ పీవో అభిషేక్ సూచన

» కందమామిడి బాలికల ఆశ్రమ పాఠశాల ఆకస్మిక తనిఖీ



కందమామిడి ఆశ్రమ పాఠశాలలో బాలికలకు భోజనాలు వడ్డిస్తున్న పీవో

పాడేరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో భోజన మెనూను పక్కాగా అమలు చేయాలని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ఆదేశించారు. మండలంలోని కందమామిడి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటగదిని సందర్శించి మెనూ చార్టు ప్రకారం వంటలు వండుతున్నదీ?, లేనిదీ? పరిశీలించారు. అన్నీ సక్రమంగానే ఉండడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయనే స్వయంగా బాలికలకు బిర్యాని వడ్డించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు సైన్సు పాఠ్యాంశాలు బోధించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని టీచర్లకు సూచించారు. విద్యార్థులకు చిన్నపాటి అనారోగ్య సమస్య వచ్చినా వెంటనే ఆస్పత్రికి తీసుకువెళ్లాన్నారు. బాలికలు డిగ్రీ పూర్తి చేసే వరకు వివాహాల జోలికి వెళ్లవద్దని, తల్లిదండ్రులు బాల్యంలోనే వివాహాలు చేసేందుకు ప్రయత్నిస్తారని, అందుకు అంగీకరించవద్దని సూచించారు. బాల్య దశలో వివాహాలతో అనర్థాలు జరుగుతాయని ఐటీడీఏ పీవో పేర్కొన్నారు. అలాగే ఆశ్రమ పాఠశాలకు హాజరుకాని బాలికల గురించి ఆరా తీశారు, విద్యాలయాల్లో డ్రాపౌట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని టీచర్లకు సూచించారు. చదివితేనే పిల్లలు భవిష్యత్తు బాగుంటుందని తల్లిదండ్రులకు వివరించి విద్యార్థులను పాఠశాలలకు తీసుకురావాలని ఐటీడీఏ పీవో చెప్పారు.

ధారాలమ్మ ఆలయం పునర్నిర్మాణానికి శంకుస్థాపన



ధారాలమ్మ ఆలయ పునర్నిర్మాణం కోసం శంకుస్థాపన నిర్వహిస్తున్న వేద పండితులు

సీలేరు, మార్చి 3: గూడెంకొత్తవీధి మండలంలోని ధారకొండ ఘాట్‌రోడ్డులో కొలువైన ధారాలమ్మ దేవాలయం పునర్నిర్మాణానికి ఆదివారం వేదపండితుల ఆధ్వర్యంలో శంకుస్థాపన జరిగింది. దేవదాయ, ధర్మదాయ శాఖాధికారులు సీజీఎఫ్ నిధుల నుంచి రూ.50 లక్షలు ఈ దేవాలయం నిర్మాణానికి మంజూరు చేశారు. ఈ మేరకు పనులు ప్రారంభించినట్టు ఆలయ ఈవో సాంబశివరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐలు అశోక్‌కుమార్, సత్యనారాయణ, తునికి చెందిన 12వ వార్డు కౌన్సిలర్ బుడిగ రాంబాబు, ఆలయ ధర్మకర్తలు రెడ్డినాగేశ్వరరావు, ఎం.నాగేశ్వరరావు, సుంకరి విష్ణుమూర్తి, అలూరి జిల్లా సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా సంయోజిత్ గొర్లె గణేశ్వరావు తదితరులు పాల్గొన్నారు. కాగా, ధారాలమ్మ ఆలయానికి అనపర్తికి చెందిన భక్తులు కర్రి అప్పారావు, వరలక్ష్మి, వారి కుమారులు, కర్రి సూర్యప్రకాశ్ రెడ్డి, మాధవి తొలి చందాగా రూ.50116 అందించారు.

కో-ఆపరేటివ్ సొసైటీ బ్యాంకులను కాపాడుకుందాం..

» సీఐటీయూ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు అజయ్‌కుమార్



పీఏసీఎస్ సమావేశంలో మాట్లాడుతున్న అజయ్‌కుమార్

పాడేరు రూరల్, మార్చి 3: రాష్ట్రంలోని కో-ఆపరేటివ్ సొసైటీ బ్యాంకులను కాపాడుకుందామని సీఐటీయూ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పి.అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. సీఐటీయూ కార్యాలయంలో పాడేరు కోపరేటివ్ సొసైటీ సిబ్బందితో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రైవేటీకరణ విధానాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉద్యమం వెయ్యి రోజులు దాటినప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీసం స్పందించడం లేదని మండిపడ్డారు. దేశ సంపదను, ప్రభుత్వ రంగ సంస్థలను అమ్ముకుంటూ, ప్రైవేటీకరణ చేసుకుంటూ పోతే భావితరాలకు ఈ దేశ సంపద ఉంటుందా? అని ప్రశ్నించారు. ప్రభుత్వ రంగంలో నడుస్తున్న బ్యాంకులను సైతం ఈ రెండు ప్రభుత్వాలు విడిచిపెట్టడం లేదని వాపోయారు. రైతుల సమకారంతో నడుస్తున్న బ్యాంకులను కూడా విడిచిపెట్టకపోవడం రాష్ట్ర ప్రజల దురదృష్టమన్నారు. వారికి నచ్చిన పద్ధతిలో జీవోలను తెచ్చి ఉద్యోగులకు జీతాలు పెంచకుండా తొక్కిపెడుతున్నారన్నారు. అటువంటి జీవోలను కోర్టు కొట్టేసిందన్నారు. కో-ఆపరేటివ్ సొసైటీ ఉద్యోగులకు సీనియార్టీని బట్టి రూ.70 వేలకు తక్కువ లేకుండా జీతాలు ఇవ్వాల్సి ఉండగా, రూ.40 వేలు మాత్రమే చెల్లించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.చిన్నయ్య పడాల్, వి.ఉమామహేశ్వరరావు, హుకుంపేట, పెదబయలు, చింతపల్లి, అనంతగిరి మండలాలకు చెందిన సొసైటీ యూనియన్ నాయకులు జి.కేశవరావు, కె.నాయుడు, రాంబాబు, ప్రసాద్, లింగమూర్తి, ఈశ్వరరావు, సింహాచలం పాల్గొన్నారు.

గిరిజన విద్యపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

» నిరాహార దీక్షా శిబిరంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు చిట్టిబాబు

పాడేరు రూరల్, మార్చి 3: గిరిజన ప్రాథమిక విద్య ప్రమాణాలపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, అందుకే ఆదివాసీ మాతృ భాష విద్యా వలంటీర్ల సమస్య పరిష్కారంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని వలంటీర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు మర్రి చిట్టిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. వలంటీర్ల సమస్యల పరిష్కారం చేయాలని కోరుతూ ఐటీడీఏ ఎదురుగా చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఈ శిబిరంలో హుకుంపేట, పెదబయలు మండలాలకు చెందిన 70 మంది వలంటీర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గిరిజన గ్రామాల్లో ప్రజలు, చిన్నారులు మాతృ భాషలో మాట్లాడుతుంటారన్నారు. వారికి తెలుగు పూర్తిగా అర్థం కాదని, దాంతో 1, 2వ తరగతిలో మాతృ భాషలో బోధన చేస్తూ తెలుగుపై చిన్నారులకు అవగాహన కల్పించాలన్న లక్ష్యంతో గత ప్రభుత్వాలు మాతృ భాష వలంటీర్లను నియమించినట్టు చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం బడ్జెట్ లేదంటూ వారిని రోడ్డున పడేయడం దారుణమన్నారు. ఇప్పటికైన స్పందించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వంతాల చంద్రయ్య, సీదరి సూరిబాబు, మజ్జి కొండబాబు, కిల్లో వీరయ్య, పాంగి బొంజుబాబు, పాంగి అచ్చమ్మ పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలల్లో అంగన్‌వాడీల విలీనం?

... 5వ పేజీ తరువాయి

క్రమంలో ఎంపికచేసిన పాఠశాలలను నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చి అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) బృందం పరిశీలించనుంది. ఈ బృందం ఆదివారం నగరానికి చేరుకుంది. సోమవారం నుంచి విశాఖ జిల్లాలోని పది మండలాల్లో ఒక్కో పూర్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించనుంది. ఆయా పాఠశాలల్లో వసతులు, భద్రతా ప్రమాణాలు వంటి అంశాలను బృంద సభ్యులు తనిఖీ చేయనున్నారు.

తాకట్టుకు ప్రజల ఆస్తులే మిగిలాయి

» అమరావతిలోని రాష్ట్ర సచివాలయాన్ని కూడా తాకట్టు పెట్టేశారు

» శ్రీలంకలో కూడా ఇంత దారుణ పరిస్థితి లేదు

» వైసీపీ ప్రభుత్వ తీరుపై టీడీపీ చోడవరం ఇన్‌చార్జి 'బత్తుల' ఆగ్రహం

బుచ్చెయ్యపేట, మార్చి 3 : వైసీపీ ప్రభుత్వం తాకట్టు పెట్టేందుకు ఇక రాష్ట్రంలో ప్రజల ఆస్తులే మిగిలాయని టీడీపీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు ఎద్దేవా చేశారు. మండలంలోని వడ్డాది పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నిన్నటి వరకు ప్రభుత్వ భవనాలు తాకట్టు పెట్టేశారని, ఇప్పుడు ఏకంగా రాష్ట్ర సచివాలయాన్నే తాకట్టు పెట్టారని మండిపడ్డారు. అప్పుల ఊబిలో మునిగిపోయిన శ్రీలంక కూడా తమ పాలనా కేంద్రాన్ని తాకట్టు పెట్టలేదని, కానీ ఇది ఒక్క జగనన్నకు మాత్రమే సాధ్యమనేలా అన్నింటినీ తాకట్టు పెడుతున్నారని ధ్వజమెత్తారు. మూడు రాజధానులంటూ మూడు ముక్కలాటకు తెరలేపిన జగన్, రాష్ట్రానికి ఒక్క రాజధాని కూడా లేకుండా చేశార న్నారు. చివరకు ఉన్న రాజధానిలోని రాష్ట్ర సచివాలయాన్ని కూడా తాకట్టు పెట్టి దివాళకోరుతనాన్ని జగన్ చాటిచెప్పారని విమర్శించారు. విశాఖలో 13 ప్రభుత్వ భవనాలు, కాలేజీలు తాకట్టు పెట్టి రూ.25వేల కోట్లు అప్పులు తెచ్చారని ఆరోపించారు. 58 నెలల జగన్ పాలనలో రూ.12 లక్షల కోట్లు అప్పు తెచ్చి ఏం చేశారని ప్రశ్నించారు. సంక్షేమ పథకాలకు రూ.2లక్షల కోట్లు ఖర్చు చేయగా, మిగిలినదంతా ఏమైందని నిలదీశారు. జగనే అధికారంలో ఉంటే మన ప్రైవేటు ఆస్తులను, భూముల్ని తాకట్టు పెట్టి లక్షల కోట్లు అప్పు తెచ్చి లూటీ చేసే ప్రమాదం పొంచి ఉందని తాతయ్యబాబు హెచ్చరించారు. టీడీపీ హయాంలో చంద్రబాబునాయుడు రూ.68 వేల కోట్లతో పెండింగ్ ప్రాజెక్టులను పరుగులు పెట్టించారని గుర్తు చేశారు.

☛ సంక్షిప్తంగా..

నేడు చెరువులవేనం వ్యూపాయింట్ ప్రారంభం



చింతపల్లి, మార్చి 3: ఆంధ్రకశ్మీర్ లంబసింగికి సమీపంలోని చెరువులవేనం, బోడకొండమ్మ ఆలయం వద్ద నిర్మించిన వ్యూ పాయింట్లను సోమవారం ప్రారంభించనున్నట్టు గిరిజన సంక్షేమ శాఖ ఈఈ డీవీఆర్ఎం రాజు తెలిపారు. ఆదివారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ చెరువులవేనంలో రూ.26.5 లక్షల ఎంపీ నిధులతో మరుగుదొడ్లు, వ్యూపాయింట్ నిర్మించామన్నారు. రూ.40 లక్షల ఎంపీ నిధులతో బోడకొండమ్మ ఆలయం వద్ద మరో వ్యూపాయింట్, ఆర్చ్ నిర్మించడం జరిగిందన్నారు. వీటిని ఎంపీ గొడ్డేటి మాధవి, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి అధికారికంగా ప్రారంభిస్తారని ఆయన చెప్పారు.

లంబసింగికి తగ్గిన పర్యాటకులు

చింతపల్లి, మార్చి 3: ఆంధ్రకశ్మీర్ లంబసింగికి పర్యాటకుల తాకిడి తగ్గింది. శీతాకాల సీజన్ ముగుస్తుండడంతో ఆదివారం లంబసింగి, చెరువులవేనం, తాజంగి జలాశయాన్ని తక్కువ మంది పర్యాటకులు సందర్శించారు. చెరువులవేనం మంచు అందాలు ఆఖరిలోనూ పర్యాటకులను అమితంగా ఆకట్టుకుంటున్నాయి. దీంతో పర్యాటకులు మంచు అందాలను ఆస్వాదిస్తూ ఎంజాయ్ చేశారు. అయితే ఎనిమిది గంటలకే ఎండ అధికంగా వచ్చేస్తుండడంతో పర్యాటకులు మధ్యాహ్నం 12 గంటలకే తిరుగు ప్రయాణమైపోయారు.

ఎలక్ట్రికల్ కార్మికులకు అండగా ఉంటాం

పాడేరు రూరల్, మార్చి 3: జిల్లాలోని ఎలక్ట్రికల్ కార్మికులకు అండగా ఉంటామని మోద ఉమా నీలకంఠేశ్వర ఎలక్ట్రీషియన్, ప్లంబర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కొట్టగుళ్లి రామారావు చెప్పారు. స్థానిక ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో జిల్లా అధ్యక్షులు పి.బబ్లూ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన యూనియన్ జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. యూనియన్ అభివృద్ధికి ప్రతి నెలా సభ్యత్వాలను చెల్లించాలని కోరారు. కార్మికులకు అన్ని సౌకర్యాల కల్పనకు రాష్ట్ర కమిటీ సిద్ధంగా ఉందన్నారు. కార్మికుల సమస్యలు, పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించిన అనంతరం నూతనంగా సభ్యత్వం పొందిన కార్మికులకు గుర్తింపు పత్రాలను అందించామన్నారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి సందడి దామోదరం, యూనియన్ నాయకులు కె.సన్యాసిరావు, జి.శివ, ఎస్.వరప్రసాద్, బి.ప్రకాశరావు, ఎల్.గిరి పాత్రుడు, పి.శేఖర్ పాల్గొన్నారు.

మోదకొండమ్మకు ప్రత్యేక పూజలు



ఆలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాడేరు రూరల్, మార్చి 3: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పాడేరు మోదకొండమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. మన్యంలోని వివిధ గ్రామాలతో పాటు మైదాన ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. దీంతో ఆలయం ఉదయం 6 గంటల నుంచి రద్దీగా మారింది. మైదాన ప్రాంతం నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి ఘటాలను సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ ప్రాంగణంలో వంటలు చేసుకుని పండగ జరుపుకున్నారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలం నాయుడు పర్యవేక్షణలో భక్త బృంద సభ్యులు, ప్రసాద కమిటీ ప్రతినిధులు కె.రామారావు, బీవీఎస్.ముకుందరావు, కె.పోతురాజు, ఎస్.కొండలరావు, కె.రమేష్‌నాయుడు, ఎస్.శ్రీనివాస్‌కుమార్ ప్రసాదం పంపిణీ చేశారు.

పల్స్‌పోలియోకు డాక్టర్ ఆలస్యంగా రావడంపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం

సీలేరు, మార్చి 3: సీలేరులో పల్స్‌పోలియో కార్యక్రమం ఆలస్యంగా ప్రారంభం కావడంతో డాక్టర్‌పై ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమను పిలిచి ఇలా అవమానించడం సరికాదని సర్పంచ్ పాంగి దుర్గో మండిపడ్డారు. ఆదివారం ఉదయం ఏడు గంటలకు కార్యక్రమానికి ఆహ్వానించారని, డాక్టర్‌తో పాటు సిబ్బంది మాత్రం 8.30 గంటలైనా రాలేదని అసహనం వ్యక్తం చేశారు. పీహెచ్‌లో ఇద్దరు వైద్యులు ఉండగా, ఒక్కరు మాత్రమే హాజరయ్యారని ఆరోపించారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పిల్లా సాంబమూర్తి, ఉప సర్పంచ్ వల్లీ ప్రసాద్ పాల్గొన్నారు.

ముమ్మరంగా పోలీసు తనిఖీలు

జి.మాడుగుల, మార్చి 3: మండలంలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నారు. నుర్మతి అవుట్ సమీప ప్రాంతంలో ప్రత్యేక బలగాలు, బాంబ్, డాగ్ స్క్వాడ్ బృందాల సాయంతో అనుమానిత ప్రాంతాల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. అనుమానిత వ్యక్తుల సంచారాన్ని తమకు తెలుపాలని ఈ సందర్భంగా సీఐ రమేశ్ ప్రజలకు కోరారు. అనంతరం నుర్మతి ప్రాంగణంలో నిర్వహించిన పోలియో కార్యక్రమంలో సీఐ పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాస్‌రావు, వైద్యాధికారి శశికాంత్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

చింతపల్లి, మార్చి 3: మండల కేంద్రంలో ఇంటర్, పదో తరగతి విద్యార్థినీ, విద్యార్థులకు పరీక్షలు రాసేందుకు అవసరమైన సామగ్రిని చేయూత వారియర్స్ ట్రస్టు సభ్యులు పంపిణీ చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్, ఏపీఆర్ కళాశాల, ఆశ్రమ పాఠశాలల్లో పది, ఇంటర్ విద్యార్థులకు అట్టలు, పెన్నులు, పెన్సిళ్లు, ఇతర సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా వారియర్స్ చైర్మన్ రమణ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో వారియర్స్ సభ్యులు ఎస్.జగన్, కె.సత్యనారాయణ, కె.బిలాస్కర్, సాయి పాల్గొన్నారు.

నేడు టీడీపీ మండల సమావేశం

డుంబ్రిగుడ, మార్చి 3: మండల కేంద్రంలోని కిడారి భవన్‌లో సోమవారం టీడీపీ మండల సమావేశం నిర్వహించనున్నట్టు పార్టీ మండల అధ్యక్షుడు తుడుము సుబ్బారావు తెలిపారు. ఈ సమావేశానికి అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి దొన్నుదొర హాజరవుతారన్నారు. ఇందులో భాగంగా నిర్వహించనున్న బాబు ష్యూరిటీ కార్యక్రమానికి నాయకులు హాజరుకావాలని కోరారు.

క్రైం... crime news

సాయినగర్ కాలనీలో చోరీ


అగంతకులు పగలుగొట్టిన బీరువా

అనకాపల్లి టౌన్, మార్చి 3: పట్టణానికి ఆనుకుని ఉన్న కొత్తూరు పంచాయతీ పరిధిలోని సాయినగర్‌కాలనీలో జరిగిన చోరీపై శనివారం రాత్రి కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్ఐ మహ్మద్ అలీ తెలిపారు. ఎస్ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. సాయినగర్‌కాలనీలో నివాసముంటున్న ఎస్. నాగేశ్వరరావు దంపతులు గత నెల 23వ తేదీన విశాఖలోని కుమారుడు ఇంటికి వెళ్లారు. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని అగంతకులు ఇంటి తలుపుల గడియను తొలగించి లోపలకి ప్రవేశించి బీరువాలోని రెండు తులాల బంగారం వస్తువులు, 50 కిలోల వెండి వస్తువులను అపహరించుకుపోయారు. శనివారం ఉదయం తలుపు గడియలు తొలగించి ఉండడాన్ని గమనించిన స్థానికులు నాగేశ్వరరావుకు సమాచారమివ్వడంతో రాత్రి వచ్చి ఫిర్యాదు చేశారు. పోలీసులు క్లూస్‌టీమ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించింది. అగంతకుల వేలిముద్రలను క్లూస్ బృందం సేకరించింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ మహ్మద్ అలీ తెలిపారు.

17 మద్యం సీసాలు స్వాధీనం

పరవాడ, మార్చి 3: మండలంలో వేర్వేరు చోట్ల 17 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. గొర్లివానిపాలెంలో నరవ రామునాయుడు పాన్‌షాపులో ఐదు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ సురేష్ తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఆదివారం దాడి చేసినట్టు ఆయన చెప్పారు. పాన్‌షాపు యజమానిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు. అలాగే బొద్దపువానిపాలెం గ్రామానికి చెందిన మేడిశెట్టి బాలాజీ 12 మద్యం బాటిళ్లను కొనుగోలు చేసి ఇంటికి తీసుకువెళ్తుండగా ఆదివారం పట్టుకున్నట్టు ఎస్ఐ మల్లేశ్వరరావు తెలిపారు. అతని నుంచి 12 క్వార్టర్ మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు.

సారా బట్టీలపై పోలీసుల దాడులు

» 500 లీటర్ల బెల్లం పులుసు ధ్వంసం

పాయకరావుపేట రూరల్, మార్చి3: మండలంలోని ఈదటం గ్రామం శివారులో ఆదివారం సారా బట్టీలపై పోలీసులు దాడులు చేసి సుమారు 500 లీటర్ల బెల్లం పులుసును ధ్వంసం చేసినట్టు ఎస్ఐ జోగారావు తెలిపారు. అలాగే సారా తయారీకి వినియోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

12 మద్యం సీసాలు స్వాధీనం

పరవాడ, మార్చి 3 : మండలంలోని ముత్యాలమ్మపాలెం గ్రామానికి చెందిన వాసుపల్లి అమ్మోరమ్మ ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి 12 మద్యం క్వార్టర్ బాటిళ్లను కొనుగోలు చేసి ఆదివారం రాత్రి ఇంటికి తీసుకువెళుతుండగా ఎస్ఐ మల్లేశ్వరరావు పట్టుకున్నారు. ఆమెపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

42 టేకు దుంగలు స్వాధీనం


అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్న టేకు దుంగలు

నర్సీపట్నం, మార్చి 3 : నాతవరం మండలం చమ్మచింత నుంచి తునికి అక్రమంగా తరలిస్తున్న టేకు దుంగలను అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల ఒకటో తేదీన రాత్రి తొమ్మిదిన్నర గంటల సమయంలో 42 టేకు దుంగలను రెండు బొలేరో వాహనాల్లో వేసి అక్రమంగా తరలిస్తుండగా, చమ్మచింత వద్ద స్వాధీనం చేసుకొని నర్సీపట్నం కలప డిపోకు తరలించినట్టు నాతవరం ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ మహేష్‌గిరి ఆదివారం తెలిపారు. ఈ కలప విలువ రూ.1.5 లక్షలు ఉంటుందని వివరించారు. ఈ ఘటనలో తుని సమీపం పాల్తేరు గ్రామానికి చెందిన గరికిన నాగశివ, కోడ మనోజ్‌లపై కేసు నమోదు, వ్యాన్లు సీజ్ చేసినట్టు చెప్పారు. ఈ దాడుల్లో ఫారెస్ట్ గార్డు గీతా మాధురి పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందాలంటే టీడీపీ, జనసేన ప్రభుత్వం రావాలి

» జనసైనికుల బూత్ కమిటీ సమావేశంలో కొణతాల రామకృష్ణ


సమావేశంలో మాట్లాడుతున్న కొణతాల రామకృష్ణ

కొత్తూరు, మార్చి 3: ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం, జనసేన పార్టీల ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావాలని టీడీపీ-జనసేన అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాలులో జరిగిన జనసేన పార్టీ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జనసేన పార్టీ బలోపేతానికి జనసైనికులంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. విశాఖ స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణను నిలిపివేయగల శక్తి ఒక్క పవన్‌కల్యాణ్‌కి మాత్రమే ఉందన్నారు. పోలవరం ప్రాజెక్టు పనులు తెలుగుదేశం, జనసేన పార్టీల ఉమ్మడి ప్రభుత్వంలోనే పూర్తవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావాలంటే ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా విశేషంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివశంకర్, అధికార ప్రతినిధి తోట సత్యనారాయణ పాల్గొన్నారు.

సరుగుడు పాతకాలనీలో తాగునీటి కష్టాలు

ఇరవై రోజులుగా పనిచేయని నీటి పథకం మోటారు

బిందెలతో మోసుకుంటూ అవస్థలు పడుతున్న నివాసితులు


పాతకాలనీలో ఉత్సవ విగ్రహంలా ఉన్న తాగునీటి ట్యాంకు

నాతవరం, మార్చి 3 : మండలంలోని సరుగుడు పాతకాలనీలో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడున్న నీటి పథకానికి చెందిన ట్యాంకు మోటారు పాడవ్వడంతో ఇరవై రోజులుగా ఈ సమస్య తలెత్తినట్టు చెపుతున్నారు. అయినప్పటికీ కన్నెత్తి చూసేవారు కరువయ్యారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత్యంతరం లేక దూర ప్రాంతానికి వెళ్లి బిందెలతో నీళ్లు మోసుకుని వస్తున్నామని మహిళలు వాపోతున్నారు. ఇళ్లలో వాడుకకు అవసరమైనన్ని నీరు మోసుకునే పరిస్థితి లేకపోవడంతో సర్దుకు పోతున్నామన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మోటారుకు మరమ్మతులు చేపట్టి తమ నీటి కష్టాలు తీర్చాలని వారంతా కోరుతున్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	120.00
లైవ్ ధర	140.00
విత్ స్కిన్	250.00
స్కిన్ లెస్	260.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

అధ్వాన రోడ్లతో అవస్థలు

» రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న పలు గ్రామాల ప్రజలు

» పట్టించుకోని పాలకులు, అధికారులు


పంచదార్ల నుంచి రాజుకోడూరు వెళ్లే రోడ్డు దుస్థితి


సంతపాలెం నుంచి వెల్చూరు మీదుగా పెదకలవలాపల్లి వెళ్లే రోడ్డు దుస్థితి

రాంబిల్లి, మార్చి 3: మండలంలోని రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. నాలుగున్నరేళ్లుగా మరమ్మతులు లేకపోవడంతో రోడ్లు పూర్తిగా శిథిలమయ్యాయి. కొన్ని రోడ్లు గోతలమయమై రాళ్లు తేలిపోయి మరింత ప్రమాదకరంగా తయారయ్యాయి. దీంతో ప్రజలు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. సంతపాలెం నుంచి వెల్చూరు మీదుగా పెదకలవలాపల్లి రోడ్డు, జంగాలపాలెం జంక్షన్ నుంచి అప్పారాయుడుపాలెం రోడ్డు, రాంబిల్లి-వెంకటాపురం నేవీ రోడ్డులో రాజుకోడూరు జంక్షన్ నుంచి పంచదార్ల వెళ్లే రోడ్డు, కృష్ణంపాలెం జంక్షన్ నుంచి కిలోమీటరు దూరంలో ఉన్న గ్రామంలోకి వెళ్లే రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. రోడ్లు పొడవునా అడుగడుగునా భారీగా గోతులు ఏర్పడడంతో ప్రమాదాలకు నిలయంగా తయారయ్యాయి. వర్షాలు పడినప్పుడల్లా ఈ రోడ్లపై ఏర్పడిన గోతుల్లో వర్షపు నీరు చేరడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రోడ్ల దుస్థితి అధ్వానంగా ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. సమస్యలను అధికారులకు చెప్పుకోవడమే తప్ప పరిష్కారానికి నోచుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ఈ రోడ్ల మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


పూర్తిగా దెబ్బతిన్న అప్పారాయుడుపాలెం రోడ్డు


రాళ్లు తేలిన కృష్ణంపాలెం రోడ్డు

కనీస సౌకర్యాలు లేకుండా టిడ్కో గృహాలు పంపిణీ

» టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్


చింతకాయల విజయ్

నర్సీపట్నం, మార్చి 3: రాజకీయ లబ్ధి కోసం వైసీపీ ప్రభుత్వం టిడ్కో గృహాలలో కనీస మౌలిక సదుపాయలు కల్పించకుండా లబ్ధిదారులకు పంపిణీ చేస్తుందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. టిడ్కో లబ్ధిదారుల తరపున గడచిన నాలుగున్నర సంవత్సరాలుగా మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు ఆధ్వర్యంలో అనేక నిరసన కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. టీడీపీ హయాంలో పదిహేను నెలల్లో 80 శాతం పూర్తి చేసిన టిడ్కో ఇళ్లను వైసీపీ ప్రభుత్వం గాలికి వదిలేసిందని విమర్శించారు. ఎన్నికల ముందు ఉచితంగా ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చిన వైసీపీ నాయకులు, ఇళ్లు ఇవ్వక పోగా లబ్ధిదారులపై రూ.70వేలు వడ్డీ భారం మోపారని వాపోయారు. దీంతో ఇటు అద్దెలు కట్టుకోలేక, అటు వాయిదాలు చెల్లించుకోలేక లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. రాజకీయ లబ్ధి కోసం ఎన్నికలకు నెల రోజులు ముందు నీరు, విద్యుత్, రోడ్లు కనీస సౌకర్యాలు లేకుండా లబ్ధిదారులకు ఇంటి తాళాలు ఇచ్చి వైసీపీ ప్రభుత్వం చేతులు దులుపేసుకుంటుందని విమర్శించారు. 46 రోజుల్లో వైసీపీ ఇంటికి పోవడం ఖాయమని, టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని సదుపాయలతో ఇళ్లు అప్పగిస్తామని విజయ్ స్పష్టం చేశారు.

బీసీ సదస్సును విజయవంతం చేయాలి


» టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు


సమావేశంలో మాట్లాడుతున్న బుద్ద నాగజగదీశ్వరరావు

అనకాపల్లి టౌన్, మార్చి 3 : ఈనెల ఐదో తేదీన మంగళగిరిలో జరిగే బీసీ సదస్సును విజయవంతం చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు పిలుపునిచ్చారు. రింగురోడ్డులోని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన బీసీ సెల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే టీడీపీ హయాంలో బీసీలకు అమలు చేసిన పథకాలన్నీ రద్దు చేసిందని విమర్శించారు. సుమారు 30కి పైగా బీసీ పథకాలు రద్దు చేయడమే కాకుండా బీసీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేశారన్నారు. బీసీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించి బీసీ ద్రోహిగా జగన్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బీసీలకు జరుగుతున్న అన్యాయాలపై ప్రశ్నిస్తున్నారని తెలుగుదేశంపార్టీలో ప్రముఖంగా ఉన్న బీసీ నాయకులపై అక్రమ కేసులు బనాయించి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, బీసీ నేత కొల్లు రవీంద్రలను జైలుకు పంపారన్నారు. మాజీ మంత్రులు సీహెచ్. అయ్యన్నపాత్రుడు, యనమల రామకృష్ణుడులపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారన్నారు. బీసీలకు జరుగుతున్న అన్యాయాలపై బీసీ రక్షణ చట్టాన్ని మినీ మేనిఫెస్టోలో పెట్టడం జరిగిందని, అధికారంలోకి రాగానే వెంటనే అమలు చేస్తామన్నారు.

ఈనెల ఐదున జరిగే బీసీ డిక్లరేషన్‌కు జిల్లాలోని ప్రతి నియోజకవర్గం నుంచి బీసీ నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని కోరారు. సమావేశంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు గింజల లక్ష్మణరావు, గుడాల సత్యనారాయణ, గుర్రం నూకరాజు, వాయిబోయిన రమణ, ఆర్. రమణ పాల్గొన్నారు.

విశాఖలో అదృశ్యమై.. జొన్నాడలో శవమయ్యాడు


ఆలమూరు మండలం జొన్నాడ సమీపాన గోదావరిలో పాతిపెట్టిన మృతదేహాన్ని వెలికితీస్తున్న దృశ్యం (ఇన్‌సెట్‌లో) హత్యకు గురైన పోతిన సాయి (పాత చిత్రం)

కొమ్మాది, మార్చి 3 : మధురవాడలోని బక్కన్నపాలెంకు చెందిన ఫొటోగ్రాఫర్ సాయి పవన్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలంలో హత్యకు గురవ్వడం స్థానికంగా సంచలనం రేపింది. పీఎం పాలెం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. బక్కన్నపాలెం గ్రామానికి చెందిన పోతిన సాయి పవన్ ఆన్‌లైన్ బిజినెస్ ద్వారా ఫొటో షూట్‌లు చేస్తుంటాడు. తండ్రి శ్రీను ఆటోడ్రైవర్ కాగా తల్లి రమణమ్మ కార్‌షెడ్ జంక్షన్‌లో ఫ్యాన్సీ షాపు నిర్వహిస్తున్నారు. వారికి ఇద్దరు కుమారులు కాగా పెద్దవాడు సాయి పవన్ (22) ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా ఫొటోషూట్ చేస్తుంటాడు. ఈ విషయం తెలుసుకున్న కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మూలస్థానం అగ్రహారానికి చెందిన షణ్ముఖ తేజ తాను కూడా ఫొటో షూట్ చేస్తుంటానని, ఫోన్ ద్వారా సాయిని పరిచయం చేసుకున్నాడు. షణ్ముఖ తేజ, సాయి వద్ద రూ. 15 లక్షల విలువైన హైటెక్నాలజీ కెమెరాలు ఉన్నట్టు తెలుసుకున్నాడు.వాటిని ఎలాగైనా దక్కించుకోవాలన్న ఉద్దేశంతో సాయికి ఫోన్ చేసి రావులపాలెంలో పెద్ద ఈవెంట్ ఉందని, నీ దగ్గర ఉన్న కెమెరాలతో ఇద్దరం కలిసి ఈవెంట్ చేస్తే మంచి డబ్బులు వస్తాయని నమ్మబలికాడు. దీంతో సాయి గతనెల 26న విశాఖ నుంచి రైలులో బయల్దేరి రాజమహేంద్రవరం చేరుకున్నాడు. అక్కడి నుంచి షణ్ముఖ తేజ కారును అద్దెకు తీసుకొచ్చి దారి మధ్యలో హత్య చేసి జొన్నాడ వద్ద గోదావరి ఇసుక తిన్నెల్లో పాతిపెట్టారు. రూ.15 లక్షల విలువ చేసే కెమెరాలు, ఇతర సామగ్రిని పట్టుకుని పారిపోయారు. అయితే ముందుగా తనకు ఏదో ఆపద జరుగుతుందని గమనించిన సాయి కారు నెంబరును తన తల్లికి వాట్సాప్ చేశారు. తన నెంబరు పని చేయకపోతే వేరే నెంబరుకు ఫోన్ చేయమని తేజ నెంబరు పంపించాడు. తన కుమారుడు ఆపదలో ఉన్నాడనే విషయాన్ని తల్లి తెలుసుకోలేకపోయింది. ప్రతిరోజూ మాట్లాడేవాడు రెండు రోజులుగా ఫోను చేయలేదని అనుమానం వచ్చి వారి వద్ద ఉన్న సమాచారంతో గతనెల 29న పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదృశ్య కేసుగా నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సాయి పంపించిన కారు నంబరు, ఫోన్ నంబరు ఆధారంగా నిందితుడు రావులపాలెంకు చెందిన షణ్ముఖ తేజగా గుర్తించారు. సాయి కుటుంబ సభ్యులు పీఎం పాలెం సీఐ రామకృష్ణ సూచన మేరకు రావులపాలెం వెళ్లగా అప్పటికే షణ్ముఖ పరారీలో ఉన్నాడు. అతని తల్లిదండ్రులను పోలీసులు విచారించగా సాయిని హత్య చేసి, కెమెరాలను పైన గదిలో పెట్టినట్టు చెప్పడంతో పోలీసులు గది తాళాలు పగలకొట్టి కెమెరాలను స్వాధీనం చేసుకున్నారు. కెమెరాలను షణ్ముఖ తండ్రిని పీఎం పాలెం స్టేషన్‌కు తీసుకువచ్చారు.

అమ్మాయితో చాటింగ్ చేయించి, పట్టుకున్నారు

నిందితుడు షణ్ముఖ తేజ మొదటి నంబరు స్విచ్చాఫ్‌లో ఉండగా రెండవ నంబరును పోలీసులు ట్రేస్ చేసి అన్నవరంలో ఉన్నట్టు గుర్తించారు. అక్కడికి వెళ్లేసరికి ఫోన్ స్విచ్చాఫ్ చేసి తప్పించుకున్నాడు. ఈ క్రమంలో పోలీసులు శనివారం షణ్ముఖ తేజకు నగరంలోని కంచరపాలెంకు చెందిన అమ్మాయికి ఫేస్‌బుక్ ద్వారా పరిచయం ఉన్నట్టు గుర్తించి ఆ అమ్మాయిని, ఆమె తల్లిని పీఎం పాలెం స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించారు. ఆమెతో షణ్ముఖకు ఫోన్‌లో చాటింగ్ చేయించారు. ఈమె మెసేజ్‌కు షణ్ముఖ స్పందించడంతో పోలీసులు అతన్ని పట్టుకున్నారు. విచారణ అనంతరం షణ్ముఖ ఇచ్చిన సమాచారం మేరకు సాయిని చంపి పూడ్చిపెట్టిన ప్రదేశాన్ని పోలీసులు గుర్తించారు. అనంతరం పవన్ తల్లిదండ్రులకు సమాచారం అందించారు. అయితే ఈ కేసులో కేవలం కెమెరాల కోసమే షణ్ముఖ ఇంతకు తెగించాడా లేదా మరో కోణం ఏమైనా ఉందా అన్న అనుమానాలు వ్యక్తం కావడంతో పోలీసులు ఆ దిశగా కూడా దర్యాప్తు చేస్తున్నారు.

బాధిత కుటుంబ సభ్యుల రోదన

వారం రోజుల క్రితం అదృశ్యమైన కుమారుడు సాయి మృతదేహం చూసి తల్లిదండ్రులు శ్రీను, రమణమ్మ బోరున విలపించారు. తమతో ఎంతో సరదాగా ఉండే సాయిని దారుణంగా చంపేశారంటూ స్నేహితులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుడిని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. కాగా ఈ కేసులో కారు డ్రైవర్ కడియం మండలం పొట్టిలంకకు చెందిన వినోద్ పాత్ర ఉన్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు.

ఆదిత్యుని దర్శనానికి పోటెత్తిన భక్తులు

సింహాచలం, మార్చి 3 : కృష్ణాపురంలోని నృసింహవనంలో కొలువుదీరిన సూర్యనారాయణస్వామి దర్శనానికి భక్తులు ఆదివారం పోటెత్తారు. వేకువ జాము నుంచే అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని, సూర్య నమస్కారాలు చేశారు. కొందరు ఆలయ ఆవరణలో దీపారాధన చేసి చిక్కుడు కాయల రథాలపై పాయసాన్ని వండి నివేదించారు. అధిక సంఖ్యలో భక్తులు రావడంతో ఆ ప్రాంతమంతా భక్తులతో కిటకిటలాడింది. కాగా భక్తులు అధికంగా వస్తున్నప్పటికీ దేవస్థానం ఇక్కడ ఒక అర్చకుడ్ని కూడా ఏర్పాటు చేయకపోగా కనీసం తాగునీరు, వసతి సౌకర్యాలు కూడా కల్పించకపోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈవో

ఏడు, ఎనిమిది తేదీల్లో ఉత్తరాంధ్ర స్థాయి ఆహ్వానపు వాలీబాల్ పోటీలు


విలేకరులతో మాట్లాడుతున్న గోవింద్

అనకాపల్లి టౌన్, మార్చి 3: స్థానిక గవరపాలెం దిబ్బవీధి కొబ్బరితోటలో ఈనెల ఏడు, ఎనిమిది తేదీల్లో ఉత్తరాంధ్ర స్థాయి ఆహ్వానపు వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్టు పోటీల కన్వీనర్ యల్లపు గోవింద్ చెప్పారు. దిబ్బవీధి రామాలయం వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ పోటీలకు ఎనిమిది జట్లు హాజరవుతున్నాయన్నారు. ఫ్లడ్‌లైట్‌లో లీక్ కమ్ నాకౌట్ పద్ధతిలో ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు మొదటి బహుమతి కింద రూ.15వేలు, రెండో బహుమతిరూ. 10వేలు, మూడో బహుమతి కింద రూ. 6వేలు, నాల్గో బహుమతి కింద రూ. 4వేలు, జ్ఞాపికలను ఇవ్వనున్నామన్నారు. క్రీడాకారులకు వసతి, భోజన సౌకర్యాలు కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ పోటీలకు ఆర్గనైజర్లుగా బుద్ద శివ, విల్లూరి ప్రసాద్ వ్యవహరిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో వాలీబాల్ క్రీడాకారులు పీలా రమణారావు, పోలిమేర శ్రీను, కాండ్రేగుల జయరాం, సీతారామదేవస్థానం చైర్మన్ దాడి భాస్కరరావు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణ గృహ నిర్బంధం


జిల్లా అధ్యక్షుడు తట్టా కృష్ణను గృహ నిర్బంధం చేసిన పోలీసులు

కశింకోట, మార్చి 3 : సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోరుతూ ఆది వారం విశాఖపట్నం లో మహాగర్జన సభ ఏర్పాటు చేశారు. ఆ సభకు వెళ్లకుండా సమగ్ర శిక్ష ఉద్యో గుల సంఘం అధ్యక్షుడు తట్టా కృష్ణను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. కనీసం తమ న్యాయమైన డిమాండ్లపై మాట్లాడడానికి స్వేచ్ఛ ఇవ్వకుండా చేయడం సరైన విధానం కాదని సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు పూడి వెంకట్రావు తెలిపారు. 22 రోజులపాటు సమ్మె చేస్తే తమ డిమాండ్లు నెరవేరుస్తామని హామీ ఇచ్చి కనీసం ఒక్క డిమాండ్ కూడా నేటికీ నెరవేర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం మేల్కొని తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

కదంతొక్కిన ఉక్కు కార్మికులు

» స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మహా పాదయాత్ర

» కూర్మన్నపాలెం నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు ర్యాలీ

» పాదయాత్రలో పాల్గొన్న రాజకీయ పార్టీల నేతలు

కూర్మన్నపాలెం, మార్చి 3: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఉక్కు కార్మికులు ఆదివారం నగరంలో కదం తొక్కారు. కూర్మన్నపాలెంలోని దీక్షా శిబిరం నుంచి ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ, వామపక్ష నాయకుల ఆధ్వర్యంలో మహా పాదయాత్రను నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలను ఖండిస్తూ ఉదయం 6.15 గంటలకు ప్రారంభమైన పాదయాత్ర వడ్లపూడి, శ్రీనగర్, చినగంట్యాడ, గాజువాక, ఆటోనగర్, షీలానగర్ మీదుగా జీవీఎంసీ కార్యాలయం సమీపంలోని గాంధీ విగ్రహం వరకు సాగింది. మహా పాదయాత్రలో మహిళలు, విద్యార్థి, దళిత, ప్రజా, నిర్వాసిత, ఉద్యోగ సంఘాలు, వామపక్ష, టీడీపీ, వైసీపీ, జనసేన, కాంగ్రెస్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు. ప్లకార్డులు, బ్యానర్లు పట్టుకుని నినాదాలతో హోరెత్తించారు.

మద్దతు ప్రకటించిన టీడీపీ

ఉక్కు పరిరక్షణే ధ్యేయంగా నిర్వహించిన పాదయాత్రలో కార్మిక సంఘాల నాయకులతో పాటు తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, నేతలు శ్రీభరత్, బొండా జగన్ పాదయాత్రలో పాల్గొన్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు చేపట్టిన నిరసనలకు పార్టీ ఆదినుంచీ అండగా నిలుస్తోందన్నారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అందరూ ఒక్కతాటిపైకి వచ్చి పోరాడాలని పిలుపునిచ్చారు. 32 మంది ప్రాణ త్యాగాలతో నిర్మించిన ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటు పరం చేస్తామంటే చూస్తూ ఊరుకోమన్నారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం తక్షణమే వెనక్కి తీసుకోకపోతే పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి మాట్లాడుతూ ఉక్కు పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఉక్కు పరిరక్షణకు వైసీపీ కట్టుబడి ఉందని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జనసేన నాయకులు కోనతాతారావు మాటాడుతూ తమ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ దీక్షలకు సంఘీభావం తెలిపారన్నారు. ఉక్కు పరిరక్షణకు జనసేన అండగా ఉంటుందన్నారు.

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ సీహెచ్ నరసింగరావు, సీపీఐ రాష్ట్ర నాయకుడు జేవీ సత్యనారాయణమూర్తి, డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె.అయోధ్యరామ్‌లు మాట్లాడుతూ ఉక్కును ముంచేలా కేంద్రం విధానాలు ఉన్నాయన్నారు. బీజేపీ మినహా మిగతా రాజకీయ పార్టీలు పాదయాత్రకు సంపూర్ణ మద్దతు తెలిపాయన్నారు. ప్రభుత్వరంగాలను తాబేదార్లకు అప్పగించాలని చూస్తున్న బీజేపీ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. పరిశ్రమకు సొంత గనులు కేటాయించకుండా అప్పుల ఊబిలోకి నెట్టిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు ప్రైవేటీకరణకు పూనుకోవడం అత్యంత దుర్మార్గమన్నారు.

యాత్రకు భారీ స్పందన

ఉక్కు కార్మికులు నిర్వహించిన మహా పాదయాత్రకు అనూహ్య స్పందన లభించింది. ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ నగరవాసులు కూడా పాదయాత్రలో పాల్గొన్నారు. ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఏసీపీలు త్రినాథ్, రాజీవ్‌కుమార్ ఆధ్వర్యంలో దువ్వాడ, స్టీలుప్లాంట్, పెదగంట్యాడ స్టేషన్లకు చెందిన పోలీసులు ఉక్కు కార్మికులతో పాటు తరలివెళ్లారు. పాదయాత్రలో జనసేన నాయకులు కోన తాతారావు, వామపక్ష నాయకులు జేవీ సత్యనారాయణమూర్తి, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు సీహెచ్ నరసింగరావు, డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె.అయోధ్యరాం, కేఎస్ఎన్ రావు, వరసాల శ్రీనివాసరావు, జె.రామకృష్ణ, జెర్రిపోతుల ముత్యాలు, నీరుకొండ రామచంద్రరావు, అడుసుమిల్లి దీప్తి, గంధం వెంకటరావు, సన్యాసిరావు, బొడ్డు పైడిరాజు, మస్తానప్ప, విళ్ల రామ్మోహన్ కుమార్, నమ్మి సింహాద్రి, దొమ్మేటి అప్పారావు, పులి వెంకట రమణా రెడ్డి పాల్గొన్నారు.

21 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

నర్సీపట్నం మార్చి 3 : పట్టణంలోని ఐదు రోడ్ల కూడలిలో గల ఒక దుకాణంలో అనధికారికంగా నిల్వ ఉంచిన 21 బస్తాల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకొని పట్టణ పోలీసులకు అప్పగించారు. దీనిపై ఆదివారం సీఐ కాంతి కుమార్ దుకాణం యజమాని బి.శ్రీనివాసుపై కేసు నమోదు చేశారు.